క్లుప్తంగా

ఆలయాలను సందర్శించిన టీటీడీ అధికారులు



ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ముస్తాబాద్/గంభీరావుపేట: ముస్తాబాద్‌లోని పురాతన శిథిలమైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని, గంభీరావుపేట శ్రీ సీతారామస్వామి దేవస్థానాన్ని టీటీడీ అధికారులు మారుతిరావు, ప్రభాకర్ గురువారం సందర్శించారు. ముస్తాబాద్‌లో ఆలయ పునర్నిర్మాణానికి రూ.కోటి పది లక్షలు మంజూరు చేసింది. ఆలయం తరఫున కమిటీ సభ్యులు రూ.27 లక్షలు కంట్రిబ్యూషన్ చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. గ్రామపంచాయతీ తీర్మానం కాపీలను అందజేయాలని కోరారు. అనంతరం శివకేశవుల ఆలయాన్ని టీటీడీ అధికారులు సందర్శించారు. సర్పంచ్ సుమతి, హరీశ్‌శర్మ వారితో ఉన్నారు. గంభీరావుపేటలో ఆలయ అభివృద్ధి కోసం రాజగోపురం, అద్దాల మండపం, ప్రవచన మండపం, భజన మందిరం, అన్నదాన సత్రం నిర్మించాలని గతంలో మంత్రి కేటీఆర్‌కు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు విజ్ఞప్తులు చేశారు. వారి వెంట మల్లుగారి నర్సాగౌడ్, విజేందర్‌రెడ్డి, వెంకటస్వామిగౌడ్ ఉన్నారు.

బీసీ శంఖారావం సభకు తరలిరావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: కరీంనగర్‌లో ఈనెల 19న నిర్వహించే బీసీ శంఖారావం సభకు బీసీలందరూ తరలిరావాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ పిలుపునిచ్చారు. గురువారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బీసీ శంఖారావం సభకు సంబంధించి పోస్టర్‌ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షుడు ఆడేపు రవిందర్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, నంది రమేశ్, యమున పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణకు సిద్ధం



పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్లలో శుక్రవారం సర్వాయ్ సర్దార్ పాపన్న విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తయినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. గురువారం ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీన్, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ అయాజ్, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిగురు గోవర్దన్‌గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై గరం

- కలెక్టర్‌కు నివేదిక పంపాలని ఎంపీపీ ఆదేశం
- వివిధ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చిన సభ్యులు
- వేములవాడ రూరల్ మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ బండ మల్లేశం

వేములవాడరూరల్: మూడు నెలలకు ఒక్కసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ కోరారు. గురువారం వేములవాడ రూరల్ మండల పరిషత్‌లో ఆయన అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో మాట్లాడారు. సమావేశానికి 11 గంటలు దాటిన పలు శాఖల అధికారులు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రాని అధికారుల వివరాలను కలెక్టర్‌కు పంపించాలని ఆదేశించారు. ఇలా చాలాసార్లు చెప్పినప్పటికీ వారిలో మార్పు రావడం లేదన్నారు. వ్యవసాయ శాఖాధికారులు గ్రామాల్లో జరుగుతున్న సమావేశాల్లో ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని కూడా ఆయన ఆరోపించారు. అనంతరం మండల సభ్యులు వివిధ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.

➡ మర్రిపల్లి గ్రామంలో నిరుపేదలకు పట్టాలు ఇచ్చినా పాస్‌బుక్ రాక ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్ సుజాత దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

➡ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి మాట్లాడుతూ పక్కనే మూలవాగు ఉన్నా ఇసుక లేక ప్రజాప్రతినిధులు, గృహ నిర్మాణ యజమానులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయంపై మానవతా దృక్పథంతో రెవెన్యూ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఒక్క ట్రిప్పుకు రూ.5 నుండి రూ.6 వేల వరకు అధిక ధరలు పెట్టి కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ విషయంపై స్పందించిన తహసీల్దార్ సుజాత తన చేతిలో ఏమీ లేదని జిల్లా అధికారుల అనుమతులతోనే ఇసుక అనుమతులు ఇవ్వడం జరుగుతుందని, ప్రభుత్వ పనులకు తప్పకుండా తన వంతుగా సహాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

➡ గ్రామాల్లో లూజ్ వైర్లు, వంగిన స్తంభాలు ఉన్నాయని, వెంటనే వాటిని సరిచేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ సుజాతను ప్రజాప్రతినిధులు శాలువా కప్పి సత్కరించారు. ఈ సమావేశానికి వైస్ ఎంపీపీ జక్కుల కవిత, జెడ్పీటీసీ ఏశ వాణి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీటీసీలు బొడ్డు శంకరవ్వ, చెన్నాడి శ్యామల, వెలుమ నర్సవ్వ, మల్లారం తిరుపతి, సర్పంచులు, సూపరింటెండెంట్ రమేశ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని బీజేపీ ధర్నాలు



వేములవాడఅర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు



ముస్తాబాద్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఎల్లారెడ్డిపేటలో నాయకులను లాకెళ్తున్న పోలీసులు

వేములవాడఅర్బన్/తంగళ్లపల్లి/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/బోయినపల్లి/వీర్నపల్లి: : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆయా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ముందుగా ర్యాలీగా వెళ్లి ధర్నా అనంతరం తహసీల్దార్‌కు వినతిప్రతాలు సమర్పించారు. సీఎం కేసీఆర్ అమలుకాని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు. ఎల్లారెడ్డిపేటలో ధర్నా చేస్తున్న నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా సీఐ శశిధర్‌రెడ్డి రంగ ప్రవేశం చేసి నాయకులను శాంతింప జేసి ఆందోళనను విరమింప జేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, జిల్లా ఉపాధ్యక్షులు గుండాడి వెంకట్‌రెడ్డి, బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు, బీజేపీ మండల అధ్యక్షులు జక్కుల తిరుపతి, కార్తీక్‌రెడ్డి, పాన్నాల తిరుపతిరెడ్డి, సంతోష్, గుడి రవీందర్‌రెడ్డి, బీజేపీ వేములవాడ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

తీజ్ వేడుకలు



రుద్రంగి: తీజ్ వేడుకల్లో గిరిజన యువతులు

రుద్రంగి/వీర్నపల్లి: గిరిజనుల సాంప్రదాయ ప్రతీక తీజ్ వేడుకలు గురువారం రుద్రంగి మండలంలోని బడి తండా, వీర్నపల్లి మండలం బంజేరు, ఎర్రగడ్డ తండా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గిరిజన యువతులు గోధుమలను బుట్టలలో ఉంచి తొమ్మిది రోజులు పాటు ఇళ్లలో ప్రత్యేక పూజలు చేసి నీరు పోస్తూ మొలకెత్తిన గోధుమ నారును దేవతలా కొలుస్తూ తొమ్మిదో రోజు నూతన వస్త్రాలు ధరించి సాంప్రదాయ నృత్యాలు చేస్తూ దగ్గరలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భాగంగా గిరిజన యువతులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. సర్పంచులు గుగులోత్ కళా, భూక్య జర్మల్, గిరిజన యువతులు పాల్గొన్నారు.



వీర్నపల్లి: గోధుమ బుట్టలతో గిరిజన మహిళలు

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తంగళ్లపల్లి: మండలంలోని తంగళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని తంగళ్లపల్లి, మండెపల్లి, తాడూర్, గోపాలరావుపల్లె, అంకుషాపూర్ గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ స్రవంతి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని కోరారు.

సమాచారం

19న ఇంటర్వ్యూలు

బోయినపల్లి: స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఈ నెల 19న నాన్ టీచింగ్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ కుక్, స్వీపర్ సిబ్బంది పోస్టులకు దరఖాస్తు చేసుకున్న మహిళా అభ్యర్థులకు ఎంఈ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూకు దరఖాస్తు చేసుకున్న మహిళా అభ్యర్థులు విద్యార్హత, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఎల్లారెడ్డిపేట: మాట్లాడుతున్న పూజ

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారం, సంక్షేమ హాస్టళ్ల పరిరక్షణకు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాత గురువారం ఎల్లారెడ్డిపేటకు చేరింది. రెండో రోజు జీపు జాత రావడంతో ఇక్కడి నాయకులు స్వాగతం పలికారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కాపల్లి పూజ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని విస్మరిస్తున్నాయన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడం ద్వారా విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటయిందన్నారు. ఈనెల 21న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, నాయకులు మంద అనిల్, మనోజ్, రాకేశ్, వేణు, ఆదిత్య, నాగరాజు, రామ్‌చరణ్, అభిషేక్, నవీన్ పాల్గొన్నారు.

గంభీరావుపేట/వీర్నపల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన సమరభేరి జీపు జాత మండల కేంద్రాల్లో గురువారం కొనసాగింది. జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర రాకేష్, వేణు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా జాలపల్లి మనోజ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్



ఎల్లారెడ్డిపేట: మందకృష్ణను విమర్శించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ కోరారు. మంద కృష్ణమాదిగ గురించి మాట్లాడే నైతిక హక్కు నాలుగు పార్టీలు మారిన రేవంత్‌రెడ్డికి లేదని, కాంగ్రెస్‌ను ప్రశ్నించే హక్కు తమకే ఉందన్నారు. ఎల్లారెడ్డిపేటలో గురువారం విలేకరులతో మాట్లాడారు. పదవుల కోసం పాకులాడే రేవంత్‌రెడ్డికి ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేస్తున్న మందకృష్ణ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కాంగ్రెస్ పదేళ్ల అధికారంలో ఉండి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టకుండా మాదిగలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉండి ఒక్కనాడు రాహుల్‌గాంధీ ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ గురించి బీజేపీని నిలదీయలేదన్నారు.

సీఈఐఆర్ పోర్టల్‌పై అవగాహన ఉండాలి



సెల్‌ఫోన్ అందిస్తున్న సీఐ కృష్ణకుమార్

బోయినపల్లి: సీఈఐఆర్ పోర్టల్‌పై అందరికీ అవగాహన కలిగి ఉండాలని వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. బోయినపల్లి గ్రామానికి చెందిన కన్నం బబిత పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆమెకు అప్పగించారు. సెల్‌ఫోన్ పోయినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ గుర్తించి బాధితురాలికి అందించారు. ఎస్సై మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

బోయినపల్లి: బోయినపల్లి నుంచి తడగొండ వెళ్లే దారిలో దర్గా పరిసరాల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో భిక్షాటన చేసి జీవించే మూగ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డు పక్కన పడి ఉన్న వృద్ధుడిని స్థానిక యువకులు గమనించి వెంటనే 108కు సమాచారం అందించి ఆ వాహనం సహాయంతో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

భూకబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలని ధర్నా



ధర్నా చేస్తున్న దమ్మనిపల్లి గ్రామస్తులు

ఇల్లంతకుంట: మండలంలోని తిప్పాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దమ్మనిపల్లి గ్రామంలో క్రీడా ప్రాంగణానికి చెందిన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం దళితులకు ఇళ్ల నిర్మాణాల కోసం 171 సర్వే నెంబర్‌లోగల 3.26 ఎకరాల భూమిని కేటాయించగా, చాలామంది ఇళ్ల నిర్మాణం చేసుకున్నారని తెలిపారు. ఆర్థిక స్తోమత లేనివారు ఇళ్ల నిర్మాణం చేయలేదని, మిగిలిన ప్లాట్లను ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణంతో పాటు, క్రీడా ప్రాంగణం కోసం కేటాయిస్తున్నట్లు తీర్మానం చేయగా, గ్రామానికి చెందిన దమ్మని మోహన్ ఈ భూమిని కబ్జా చేశాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వంద మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస అన్నారు. గురువారం తంగళ్లపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో సంచార ఈవీఎం, వీవీపాట్ వాహనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ ఓటింగ్ యంత్రాలపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, వార్డు సభ్యులు రెడ్డి పరుశరాములు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీమా చెక్కులు అందజేత

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన గుగ్లోతు తార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పోస్టాఫీస్ నుంచి మంజూరైన రూ.12 లక్షల చెక్కును కరీంనగర్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శివాజి వారి కుటుంబసభ్యులకు అందజేశారు. పోస్టాఫీస్‌లో బజాజ్ లైఫ్ గ్రూప్ టర్మ్, జీవన జ్యోతి బీమా యోజన, పాలసీలు తీసుకోవడం వల్ల రూ.12 లక్షలను వారికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి, పోస్టల్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ భాస్కర్‌నాయక్, తొర్తి రాజేశ్, రేవతి, ఐతుపల్లి రవికుమార్, రవీందర్, మల్లేశం, తిరుపతి, ఎగుర్ల రాజు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేసే వరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధనంసోత్ ప్రకాశ్‌నాయక్ అన్నారు. ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హాస్టల్స్ ఇన్‌చార్జి రంజిత్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రకాశ్‌నాయక్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ మూడేళ్ల క్రితం డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చి మర్చిపోయారన్నారు. మూడేళ్లుగా పేద మధ్యతరగతి విద్యార్థులు ముఖ్యంగా బాలికలు డిగ్రీ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసే వరకు ఉద్యమాలు చేస్తామని, మంత్రి పర్యటనలను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో అక్కిం నాగరాజు, ప్రశాంత్, కిశోర్, మధు, రాజేశ్, ఆనంద్, ఆకాశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోటికి నల్ల గుడ్డలు కట్టుకుని..



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

వేములవాడరూరల్: వేములవాడ విద్యాధికారి కార్యాలయంలో సమగ్ర శిక్షణ కాంట్రాక్టు ఉద్యోగులు నోటికి నల్ల గుడ్డ కట్టుకుని గురువారం నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని హైదరాబాద్ ఎస్పీడీ కార్యాలయం వద్ద శాంతియుత ధర్నాకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్న దానికి నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఎంఐఎస్ నవీన్, సల్మాన్, మల్లేశ్, నగేశ్, చైతన్య, ధనుంజయ్, కనకయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రామాలయం నిర్మాణానికి స్థల పరిశీలన

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో శ్రీ సీతారాముల ఆలయ నిర్మాణానికి గురువారం టీటీడీ నిర్మాణ అధికారి రామనాథం ఆధ్వర్యంలో గ్రామస్తులు స్థలాన్ని పరిశీలించారు. గజభీంకార్ రాజన్న, జాలగం ప్రవీణ్ (టోని), రాపెల్లి ఆనందం, పెద్దూరి తిరుపతి, అంకారపు రవి పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

తంగళ్లపల్లి: జిల్లా కేంద్రంలో శుక్రవారం సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు గౌడ సోదరులు తరలిరావాలని గౌడ సంఘం మండల నాయకులు పిలుపునిచ్చారు.

ఆలయ నిర్మాణానికి రూ.40 లక్షలు

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామ సీతారామ చంద్రస్వామి ఆలయం పునర్నిర్మాణానికి రాష్ట్ర దేవాదాయశాఖ నుంచి గురువారం రూ.40 లక్షలు మంజూరైనట్లు జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు తెలిపారు.

ఎల్ఓసీ అందజేత

గంభీరావుపేట: వెన్నుపూస దగ్గర గడ్డతో బాధ పడుతున్న మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మాడుగుల దేవయ్యకు రూ. 2.50 లక్షల ఎల్ఓసీని స్థానిక టీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్ బాధితకుటుంబానికి గురువారం అందించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ విమర్శలు

గంభీరావుపేట: సిరిసిల్ల నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ కృషితో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండలశాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణ శాఖ అధ్యక్షుడు వెంకటి యాదవ్ అన్నారు.

ప్రైవేటు పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మదన్

సిరిసిల్లటౌన్: ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సిరిసిల్ల సిద్ధార్థం ఇంగ్లీష్ మీడియం పీఈటీ బాదావత్ మదన్ ఎన్నికయ్యారు. గురువారం సిరిసిల్లలో నిర్వహించిన సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా కురుకుంట్ల రాజశేఖర్, ఉపాధ్యక్షుడు లింగాల సుధాకర్, సహాయ కార్యదర్శి గుర్రం భరత్, కోశాధికారి లకావత్ సుధాకర్‌ను ఎన్నుకున్నారు.

ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా గౌతమ్‌గౌడ్

గంభీరావుపేట: ఎన్ఎస్‌యూఐ గంభీరావుపేట మండల అధ్యక్షుడిగా గడ్డమీది గౌతమ్‌గౌడ్ నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సాయిప్రసాద్‌యాదవ్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ ఉత్తర్వులను గౌతమ్‌గౌడ్‌కు అందించారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలన

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో నిర్మించిన కేసీఆర్‌నగర్ (డబుల్ బెడ్రూం) సముదాయాన్ని గురువారం కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ (టోని) ఆధ్వర్యంలో పరిశీలించారు. అన్ని సదుపాయాలు కల్పించాలని అన్నారు.

అన్నదానం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయం వద్ద నున్న 150 మంది పేదలకు మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన ఏర్పుల సురేశ్ అనే యువకుడు బావిలో పడి మృతి చెందగా, బాధిత కుటుంబానికి సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

రుద్రంగిలో వర్షం

రుద్రంగి: మండలంలో గురువారం ఉదయం కురిసిన వర్షం అన్నదాతకు ఊరటనిచ్చింది. వర్షంతో వరి పొలాలకు చీడ పీడల బెడద నుంచి విముక్తి లభిస్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మర్లపేట చెట్ల నరికివేతలో రూ.25 వేల జరిమానా

బోయినపల్లి: మండలంలోని మర్లపేట గ్రామ బీటీ రోడ్డు పరిసరాల్లో హరితహారం చెట్లను నరికివేసిన వారికి రూ. 25,636 జరిమానా విధించినట్లు అధికారులు గురువారం తెలిపారు. చెట్ల నరికివేత విషయం పత్రికల్లో రాగా అటవీశాఖ ఎఫ్ఎస్‌వో అఫ్జల్ హుస్సేన్, ఎఫ్‌బీవో అనితతో క్షేత్రస్థాయిలో ధ్వంసమైన చెట్లను పరిశీలించి జరిమానా అంచనా వేసి ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డికి అందించినట్లు ఎఫ్ఎస్‌వో తెలిపారు.

కొనసాగుతున్న సర్వే

ఎల్లారెడ్డిపేట: ఇళ్లు లేని వారికి సొంత స్థలంలో గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో గురువారం అధికారులతో కలిసి గృహలక్ష్మి సర్వేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చాడ భూంరెడ్డి, సర్పంచ్ తెడ్డు అమృత, ఎంపీటీసీ మల్లేశం, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.